క్లుప్తంగా

గంగమ్మా.. వర్షాలు కురిపించమ్మా!



చిత్తపారలో ఊరేగుతున్న అమ్మవారు

గుడిపాల: వర్షాలు కురిపించి, పంటలు బాగా పండేలా దీవించాలని కోరుతూ చిత్తపార గ్రామస్తులు బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఉదయం అమ్మవారికి అంబలి పోసి, పొంగళ్లు పెట్టారు. బుధవారం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం అభిషేకం నిర్వహించారు. పలువురి వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా 'బలిబండి'



బలికూడు కోసం వెళ్తున్న భీమసేనుడు

గుడిపాల: మండలంలోని వసంతాపురంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం పలు గ్రామాల్లో బకాసురునికి బలి బండి కార్యక్రమం నిర్వహించారు. వసంతాపురంతోపాటు బసవాపల్లె, చెరువుముందవూరు, పశుమంద, గుడిపాల క్రాస్, కోలావూరు, రెట్టగుంట, కట్టకిందపల్లె, దళవాపల్లె గ్రామాల్లో ట్రాక్టర్‌లో భీమసేనుడు పాత్రధారి గ్రామవీధుల్లో ఊరేగుతూ బలికూడు తీసుకెళ్లాడు.

నేడు ద్రౌపదీ అమ్మవారి కల్యాణం

వసంతాపురంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం ద్రౌపదీదేవి, పాండవులకు కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు మహాభారత కమిటీ సభ్యులు తెలిపారు.

దిగువమాఘం సచివాలయం తనిఖీ



సూచనలిస్తున్న ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి

తవణంపల్లె: మండలంలోని దిగువమాఘం సచివాలయాన్ని బుధవారం తవణంపల్లె ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి తనిఖీ చేశారు. సచివాలయానికి సంబంధించిన రికార్డులు, సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆధార్ అనుసంధానం పనులు వేగవంతం చేయాలన్నారు. స్పందనలో వచ్చిన అర్జీలను వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. ఎంపీడీఓతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి



శిబిరంలో మాట్లాడుతున్న కన్వీనర్ బుజ్జిరెడ్డి

ఐరాల: ప్రతి ఒక్కరూ కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో అరగొండ అపోలో టోటల్ హెల్త్, తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆస్పత్రి సౌజన్యంతో కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 156 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 56 మందికి ఉచితంగా కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. అలాగే 22 మందిని కంటి శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్లు వైద్యులు తెలిపారు. ఎంపీపీ మోహన్, ఐరాల సర్పంచ్ గుణవతి, పార్టీ నాయకులు సురేంద్రయాదవ్, మురళి, రత్నం, అపోలో వైద్యులు, అరవింద కంటి వైద్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



మృతురాలు

యాదమరి: స్పృహ తప్పి పడిపోయిన మహిళ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు. చిత్తూరు నుంచి యాదమరి వైపు వస్తున్న మహిళ ఈ నెల 19న కమ్మరాయని మిట్ట వద్ద కిందపడి మతిస్థిమితం కోల్పోయింది. ఆమెను చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఈ మహిళను ఎవరైనా గుర్తుపడితే 9440900684 ను సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

కర్ణాటక మద్యం పట్టివేత

చిత్తూరు అర్బన్: నగరంలోని పాతబస్టాండు సమీపంలో అర్బన్ ఎస్‌ఈబీ అధికారులు అక్రమ మద్యం విక్రయాలపై బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో 11 ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, సంపత్‌కుమార్(35)ను అరెస్టు చేశారు. కార్యక్రమంలో సీఐ జోగేంద్ర, ఎస్‌ఐ బాబు ఉన్నారు.

తవణంపల్లె మండలంలో బుధవారం అక్రమ కర్ణాటక మద్యం పట్టుబడడంతో ఓ వ్యక్తిపై ఎస్‌ఈబీ అధికారులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆయన అందించిన సమాచారం మేరకు మత్యం ప్రాంతంలో వారు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అరుల్ (62) అనే వ్యక్తి నుంచి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం విక్రేతపై కేసు నమోదు చేసి అరెస్ట్ చూపించారు.

మృత్యు నీడలో విద్యుత్ సిబ్బంది

- మామూళ్లపై ఉండే ఆసక్తి పనిపై లేదు
- కిందిస్థాయి సిబ్బంది మధ్య విభేదాలు
- సమస్యలపై స్పందించని ఏఈలు



యాదమరి/ చిత్తూరు కార్పొరేషన్: సచివాలయ పరిధిలో పనిచేస్తున్న జూనియర్ లైన్‌మన్(జేఎల్‌ఎం-2)ను లైన్‌మెన్లు విధి నిర్వహణలో సహాయకులుగా వాడుకోవాలి. కానీ క్షేత్రస్థాయిలో అవగాహన లేని జేఎల్‌ఎంల చేత విద్యుత్‌శాఖ ఏఈలు, లైన్‌మెన్ విధులకు పంపిస్తుండడంతో వారు ప్రమాదాలకు గురికావడం, తాజాగా మంగళవారం ఒక జేఎల్‌ఎం మృత్యువాత పడ్డాడు. ఇలా మృత్యువు పంజా విసురుతున్నా, బాధ్యత లేని అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

కొన్ని ప్రమాద ఘటనలు

- గత సంవత్సరం యాదమరి సెక్షన్ చిన్నంపల్లెలో జేఎల్‌ఎం-2 భానుప్రకాష్ విధి నిర్వహణలో పనిచేస్తూ గాయపడ్డాడు.
- ఈ మార్చిలో యాదమరి సెక్షన్ పెరుమాళ్లపెంటలో జేఎల్‌ఎం-2 ఎస్.నరేష్ వ్యవసాయ సర్వీసు పరంగా పనులు చేస్తూ గాయపడ్డాడు.
- పూతలపట్టు మండలం పంటపల్లెలో సురేష్ లైన్ మరమ్మతు పనులు చేస్తూ ప్రమాదానికి గురయ్యాడు.
- పెనుమూరులో ఉద్యోగం సంపాదించిన మూడు నెలల్లో తోహిద్దిన్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తూ మరణించాడు.
- యాదమరి మండలంలో ఈ నెల 8న జోడిచింతల వద్ద విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తూ రిటర్న్ సప్లై రావడంతో జేఎల్‌ఎం-2 పవన్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.
- స్పందించని సిబ్బంది

చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలో సంతపేట, మిట్టూరు, రూరల్, యాదమరి సెక్షన్ల పరిధిలో తరుచూ లైన్‌ట్రిప్ప్ అవ్వడం, ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ పోవడం, ఎల్‌సీ తీసుకోవడం పరిపాటిగా మారింది. కరెంటు పోయిన పట్టించుకునే నాథుడు లేదు. పెనుమూరు, పూతలపట్టులో తరచూ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు అయిన సకాలంలో బాగు చేయడం లేదు. విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

సమన్వయలోపం

చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్ పరిధిలో వాటాల పంపకంలో 10 మంది ఉద్యోగులు గొడవపడ్డారు. అదే విధంగా ఓ సెక్షన్‌లో లైన్‌మన్, జేఎల్‌ఎంలు ఒకేచోట డ్యూటీ కావాలని గొడవపడటంతో వారి పంచాయతీ డివిజన్ కార్యాలయం వరకు చేరింది. సర్వీసు ఇవ్వాలన్నా, సెక్షన్ పరిధిలో కరెంటు సమస్యలు వచ్చినా, లైన్‌మన్ క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించాలి. కానీ సిబ్బంది మధ్య సమన్వయలోపంతో పనులు చేయడం లేదు. జేఎల్‌ఎంను ఫీల్డ్‌కు పంపి లైన్‌మెన్లు కొందరు కార్యాలయాలకు పరిమితమవుతున్నారు. లైన్‌మెన్, జేఎల్‌ఎం పనులను పర్యవేక్షించాల్సిన లైన్ ఇన్‌స్పెక్టర్లు నిర్లక్ష్యంగా ఉన్నారు. ఎంతసేపు వారి లాభమే తప్ప వినియోగదారుల కష్టాలే పట్టించుకోవడం లేదనే ఫిర్యాదులున్నాయి. రూరల్ డివిజన్ పరిధిలో ఓ డీఈ, ఏఈల మధ్య విభేదాలు ఉండడం, వాటాలు సరిగ్గా ఉన్నతాధికారులకు ఇవ్వలేదన్న మరో కారణంతో ఓ డీఈని బాధ్యతలు తీసుకొని ఏడాది కూడా పూర్తవ్వకముందే అతడిని బదిలీ చేశారనే విమర్శలు ఉన్నాయి. యాదమరి మండలంలో ఏఈకి నగదు ఇచ్చిన వారికి మాత్రమే వెంటనే విద్యుత్ సర్వీసులు ఇస్తున్నారని ఆరోపణలు విద్యుత్ శాఖ సిబ్బందే బహిరంగంగా చెబుతున్నారు.

అలాగే వైర్లు లాగడంలో సరైన జాగ్రత్తలు పాటించక ఇష్టారాజ్యంగా లాగడంతో ఎల్‌సీలు తీసుకొని మరమ్మతులు చేస్తున్నప్పటికీ రిటర్న్ సప్లై వస్తోంది. దీంతోనే గత ఆరు నెలల్లో నాలుగు ప్రమాదాలు చోటు చేసుకోవడంతో ముగ్గురు జేఎల్‌ఎంలు గాయాలపాలయ్యారు.

లైన్‌మెన్‌ల నుంచి మామూళ్లు

మండల పరిధిలో పలు కొత్త సర్వీసులకు లైనమెన్లు తీసుకున్న మామూళ్ల నుంచి ఉన్నతాధికారులకు అందుతున్నట్లు తెలిసింది. ఈ కారణం వల్లే మండల పరిధిలోని విద్యుత్‌శాఖలో ఎటువంటి ప్రమాదాలు జరిగినా ఉన్నతాధికారులు లైన్‌మన్లపై చర్యలు తీసుకోవడం లేదని సిబ్బంది అందరూ చెప్పుకుంటున్నారు. కిందిస్థాయి అధికారులు బహిరంగంగానే చెబుతున్నారు.

ప్రమాదాలు జరిగితే సహించం



విద్యుత్‌శాఖలో ప్రమాదాలు జరిగితే సహించం. ఎక్కడ ప్రమాదం జరిగినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో చాలా వరకు విద్యుత్‌శాఖ అధికారులు సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారని, పనులు చేయడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయి. దీనిపై నివేదికలు ఇవ్వాలని డీఈ, ఏడీకి ఆదేశాలు జారీ చేశాం. తప్పు చేసిన వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

-కృష్ణారెడ్డి, ఏస్‌ఈ, ట్రాన్స్‌కో

జేవీకే కిట్ల పరిశీలన



కిట్లను పరిశీలిస్తున్న సీఎంఓ గుణశేఖర్‌రెడ్డి

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు అందిస్తున్న జగనన్న విద్యా కానుక (జేవీకే)కిట్లను జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ గుణశేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఇప్పటివరకు మండలంలో యూనిఫారం 3,432 మందికి, బెల్టులు 2,575, పాఠ్యపుస్తకాలు 19,258, ఒకటో తరగతికి డిక్షనరీలు 215, ఆక్సఫర్డ్ డిక్షనరీలు 407 చేరాయని పేర్కొన్నారు. వీటిని విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ప్రతి విద్యార్థికి అందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. జిల్లా ఏసీఎంఓ ఉదయలక్ష్మి, ఏఈ ఖాదర్‌బేగం, ఏపీఓ నాగరత్న, పీఆర్‌సీ సిబ్బంది, సుప్రజ పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో కూలీలకు పనులు

తవణంపల్లె: గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులపై అవగాహన కల్పించి పనులు చేపట్టాలని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పనులపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో రోజుకు 2300 మంది పనులు చేసే విధంగా ఉపాధి సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపాధి పనుల లక్ష్యాన్ని అధిగమించుటకు అందరూ కృషి చేయాలన్నారు. దివ్యాంగుల సంఘాల ద్వారా ఉపాధి పనులు చేయించేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఉపాధి కూలీల ఆధార్‌కార్డును బ్యాంకు ఖాతాలకు అనుసంధానం చేయించాలని తెలిపారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచే విధంగా ఫీల్డు అసిస్టెంట్లు పని చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఓ లలిత, ఉపాధి సబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే వస్తున్నా



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు మీ గడపకు వస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో బుధవారం ఉదయం పేట అగ్రహారం పంచాయతీలో ఎస్టీ కాలనీ, దళితవాడ, రంగంపేట క్రాస్ గ్రామాల్లో ప్రతి గడపకు వెళ్లారు. పేట అగ్రహారం, దళితవాడ, పేట అగ్రహారం ఎస్టీ కాలనీ, రంగంపేటక్రాస్ పంచాయతీలో లబ్ధిదారులకు బుక్‌లెట్లను అందజేశారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా? లేదా? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు తెలిపిన వారికి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉంటేనే మరిన్ని పథకాలు అందుతాయని చెప్పారు. తెలుగుదేశం పార్టీ కల్లిబొల్లి మాయమాటలు నమ్మి మోసపోరాదన్నారు. సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, రాజారత్నంరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ కుమారి, జెడ్పీటీసీ దేవిక, వైస్‌ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, మురళీకృష్ణ, సర్పంచుల సంఘం అధ్యక్షులు జయచంద్రరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కమ్మగుట్టపల్లి పంచాయతీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గౌరి ఓ ప్రకటనలో తెలిపారు.

విరుపాక్షమ్మ సేవలో ఎమ్మెల్యే

ఐరాల: మండలంలోని గుడిపల్లెలో విరుపాక్షమ్మ జాతర సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు ఆలయ నిర్వహకులు ఘన స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

భవన యజమాని దౌర్జన్యం

చిత్తూరు రూరల్: చెప్పుల దుకాణం ఖాళీ చేయాలని దౌర్జన్యంగా తమపై దాడులకు పాల్పడుతున్న వారి నుంచి కాపాడాలని కోరుతూ, బాధితులు అమరేష్, మల్లీశ్వరి మీడియాకు విన్నవించారు. వారు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు మాట్లాడుతూ, పూతలపట్టు మండలం ఆఖనంబట్టు గ్రామానికి చెందిన తాము 2018లో ఐరాల మండలం సంతగేటు పాటూరుకు చెందిన రామ్మూర్తి నాయుడి వద్ద ఓ భవనాన్ని 10 ఏళ్లకు లీజు తీసుకుని అగ్రిమెంట్ చేయించుకున్నామని తెలిపారు. ఆ భవనంలో తాము చెప్పుల దుకాణం నడుపుతున్నామన్నారు. అయితే భవన యజమాని దుకాణం ఖాళీ చేయాలని టీడీపీ నాయకుడు అనుచరులతో వచ్చి దుకాణం ధ్వంసం చేశారని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన ఏఎస్పీ



జిల్లా ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సుధాకర్ బుధవారం కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన బుధవారం కలెక్టరేట్‌కు విచ్చేసి కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. - చిత్తూరు కలెక్టరేట్

విత్తు వేయండి.. సాగు చేయండి



చింతలగుంట సచివాలయంలో వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాలను విత్తి, సాగును బహుబాగుగా చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు మండలం తాళంబేడు గ్రామంలో బుధవారం వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈసారి సాధారణ వర్షపాతం కంటే అధిక వర్షపాతం నమోదైందన్నారు. కురుస్తున్న వర్షాలు ఖరీఫ్‌కు అనుకూలంగా ఉన్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రాయితీ విత్తనాలను రైతులకు ముందస్తుగానే పంపిణీ చేస్తోందన్నారు. మండలానికి 1,200 క్వింటాళ్ల విత్తనాలను కేటాయించిందన్నారు. భూ విస్తీర్ణాన్ని బట్టి ప్రతి రైతుకు ఒకటి, రెండు బ్యాగులు ఇస్తారని తెలిపారు. ఈ కాయలను సద్వినియోగం చేసుకుని రైతులంతా విత్తు వేయాలని సూచించారు. అనంతరం రైతులకు కాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అమరనాథ్‌రెడ్డి, సంపత్ పాల్గొన్నారు.

ఎన్ని కష్టాలున్నా ఆగని సంక్షేమం

రాష్ట్రంలో ఎన్ని కష్టాలున్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేట, పాలూరు, ముత్తుకూరు, దిగువమాసాపల్లి, తాళంబేడు, చింతలగుంట, తుమ్మింద, పెద్దిశెట్టిపల్లి సచివాలయాల్లో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో గువ్వకల్లు వలంటీరు షాలిని, తాళంబేడు వలంటీర్ మధుబాబుకు సేవా వజ్ర వరించిందన్నారు. సేవారత్న బీఎస్‌ఆర్‌పేట రమ్య, చెర్లోపల్లి సురేఖ, సతీష్, దిగువమాసాపల్లి భానుచంద్ర, తుమ్మింద సంగీత ఎంపికయ్యారని, మిగిలినవారికి సేవామిత్రలుగా ప్రభుత్వం గుర్తించారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయరాం, రంజని, నాయకులు త్యాగరాజులు, రాము, భాస్కర్, రాబర్ట్, వేలుస్వామి, ప్రతిమారెడ్డి దిలీప్, సుబ్రమణి, వినాయకం పాల్గొన్నారు.

యాళివాహనంపై ఉగ్రనరసింహుడి విహారం



యాళి వాహనంపై విహరిస్తున్న స్వామివారు

యాదమరి: మండల కేంద్రంలో వెలసిన ఇంద్రవరదుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడవరోజు స్వామివారు ఉగ్రనరసింహ స్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మూలస్థానంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదునికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అర్చన నిర్వహించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుని మత్స్యఅవతారంలో సప్పరం ఉత్సవంలో కొలువుదీర్చి భక్తులకు దర్శనం కల్పించారు. సప్పరంలో ఉత్సవాన్ని మేళతాళాలతో మంగళవాయిద్యాలతో పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి, మంగళ హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

యాళిపై ఊరేగిన స్వామివారు

ఇంద్రవరదుని బ్రహ్మోత్సవాల్లో మూడవ రోజు బుధవారం రాత్రి స్వామివారి ఉగ్రనరసింహుని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉగ్రరూపంలో ఉన్న యాళి అనే జంతువు ప్రజలపై దాడులు చేసి ఇబ్బందులకు గురి చేస్తుండడంతో భక్తులు స్వామివారిని వేడుకోగా స్వామివారు ఉగ్రనరసింహుని అవతారంలో వచ్చి యాళిని అదుపులోకి తీసుకొని అదే జంతువుపై భక్తులకు దర్శనమిచ్చి కాపాడుతాడని, అదే విధంగా స్వామివారు యాళివాహనంపై విహరించి భక్తులకు దర్శనమిస్తారు. స్వామివారిని దర్శించుకుంటే సకల పాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం. స్వామివారికి భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి పూజలు చేశారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంలో, రాత్రి శేషవాహనంలో ఊరేగనున్నారు.

నగరంలో పకడ్బందీగా వ్యర్థాల నిర్వహణ



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: నగరపాలక డంపింగ్ యార్డులో వ్యర్థాల నిర్వహణ మరింత పకడ్బందీగా చేపట్టాలని నగర కమిషనర్ అరుణ నగరపాలక ప్రజారోగ్య, ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. కమిషనర్ బుధవారం ఉదయం నగరపాలక డంపింగ్ యార్డును తనిఖీ చేశారు. వ్యర్థాల నిర్వహణలో భాగంగా డంపింగ్ యార్డ్‌లో ఏర్పాటుచేసిన బాలింగ్ మిషన్, కోకోనట్ షడ్డర్, పల్వరైజర్ యంత్రాలను, వాటి పనితీరును పరిశీలించారు. యంత్రాల వినియోగంపై రోజువారీ నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. బయోమైనింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. డంపింగ్ యార్డులో వర్మీ కంపోస్టు, విండ్రో కంపోస్టు, సేంద్రియ వ్యవసాయాన్ని మరింత మెరుగ్గా చేపట్టాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. అనంతరం గాంధీ కూడలి వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులను పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డా.లోకేష్, డీఈ రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ, ఏఈ శ్రీలత, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పశుబీమా వినియోగించుకోండి

గుడిపాల: పాడి రైతుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకం అమలులోకి తెచ్చిందని గుడిపాల పశు వైద్యాధికారి సాయిసుధ తెలిపారు. మండలంలోని పాడి రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు ఉన్న వైఎస్సార్ బీమా పథకంలో స్వల్పంగా మార్పులు-చేర్పులు చేస్తూ ప్రభుత్వం తాజాగా జీఓ నంబర్ 3 విడుదల చేసిందన్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం కింద లైవ్ స్టాక్స్ ఇన్సూరెన్స్ పథకం ప్రభుత్వం అమల్లోకి తేనుందన్నారు. పాడిపశువు చనిపోయిన 15 రోజుల్లోపే నష్టపోయిన రైతుకు పరిహారం వర్తించేలా నిబంధనలు రూపొందించారన్నారు. బీమా ప్రీమియం చెల్లిస్తే ఎద్దులు, గొర్రెలు, మేకలకు ఈ పథకం కింద పరిహారం పొందవచ్చన్నారు.

శాస్త్రోక్తంగా తిరుమంజనం

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ప్రధాన ఆలయంలో బుధవా రం ఆలయ అధికారులు, అర్చకులు శాస్త్రోక్తంగా తిరుమంజనం సేవను నిర్వహించారు. ప్రతి బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే ఈ సేవలో స్వామివారి ఆలయంలో నవగ్రహ మండపం, గణపతి హోమ మండపం, ప్రాకార మండపం, ప్రధాన ఆలయం శుద్ధి చేశారు.

వరసిద్ధుని సేవలో కర్ణాటక ఎమ్మెల్యే

వరసిద్ధి వినాయక స్వామిని కర్ణాటకలోని దక్షిణ బెంగళూరు సిటీ ఎమ్మెల్యే కృష్ణప్ప కుటుంబ సభ్యులతో కలసి బుధవారంవిచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు కల్పించారు.

హరికథా గానం

వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆవరణలోని కల్యాణ వేదికలో తిరుపతికి చెందిన సాయి విరాళ పర్వాన్ని హరికథా గానంలో వినిపించారు.

పాలేరులో కేంద్ర బృందం

బంగారుపాళెం: మండలంలోని పాలేరు గ్రామంలో బుధవారం కేంద్ర జలశక్తి బృందం పర్యటించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను కేంద్ర జలశక్తి బృందం సభ్యులు సచీంద్రకుమార్ పట్నాయక్, డాక్టర్ సోమేంద్రసింగ్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన అమృత్ సరోవర్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. పనులను సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఏపీడీ వరప్రసాద్‌కు సూచించారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఓ ఉమావాణి, ఈసీ గణేష్, ఏపీఓ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంతో గ్రామీణ ప్రాంతంలో ప్రతి ఇంటికీ వైద్యసేవలు అందుతున్నాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం 35 యర్లంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తవణంపల్లె: కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాల్సిన అవసరం ఉందని స్థానిక వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఎగువ తవణంపల్లెలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక 72 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఘనంగా గంగమ్మ నిమజ్జనం

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ బుధవారం రాత్రి ఘనంగా ఊరేగించారు. మూడు రోజుల పాటు అమ్మవారి జాతర కనుల పండువలా సాగింది. జాతర కార్యక్రమంలో భాగంగా సోమ, మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. చివరి రోజు బుధవారం ఉదయం అమ్మవారికి అభిషేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వివిదరకాల పుష్పాలతో కనువిందుగా అలంకరించి ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం అమ్మవారి సన్నిధి నుండి బొమ్మాయిపల్లె, కురపల్లె, తిమ్మోజుపల్లె, కరిడివారిపల్లె, రామానాయుడుపాళెం మీదుగా ఊరేగించారు.

నడివీధి గంగమ్మ జలధికి..

జాతరలో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి శిరసును విశేషంగా అలంకరించి సింహ వాహనంపై అధిష్టింపజేశారు. అనంతరం పురవీధుల్లో బాణసంచా వేడుకల నడుమ ఘనంగా ఊరేగించారు. తెల్లవారు జామున గ్రామ నడివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో గంగమ్మను కొలువుదీర్చారు. పెద్దసంఖ్యలో భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారిని జలప్రవేశానికి తరలించారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో పలుచోట్ల బుధవారం గంగమ్మ నిమజ్జనం అట్టహాసంగా సాగింది. మురుగానంపల్లి కట్టమంచి, మూడో గేటు, జంబుగోళంపల్లి తదితర గ్రామాల్లో గంగ జాతరను రెండు రోజులపాటు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బుధవారం రాత్రి అమ్మవారిని నగర వీధుల్లో ఊరేగించారు. ఊరూరా కటాక్షించిన అమ్మవారిని చివరకు జలధి చేశారు. మూడవ గేటులో ఏర్పాటు చేసిన డప్పు వాయిద్యాలు యువతను అలరించాయి. ప్రత్యేక వేషధారణాలు, ఓంశక్తి భక్తుల విన్యాసాలు అబ్బురపరిచాయి.



జలధికి తరలుతున్న వజ్రాలపురం గంగమ్మ



నడివీధిలో కొలువుదీరిన గంగమ్మ



వేషధారణలు, ఓం శక్తి భక్తుల ర్యాలీ